
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 మార్చి 2024
5



తిరుపతి

దళితుని మృతి పై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ అనుమానాస్పద మృతిపై విచారణ కొనసాగుతున్నట్లు వన్‌టౌన్ సిఐ విశ్వనాధ రెడ్డి తెలిపారు. ఈ కేసులో నాగరాజు, రఘులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, సుధాకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోస్టుమార్టం రిపోర్టు అందిన తర్వాత అతిగా మద్యం సేవించి మృతి చెందాడా, హత్య అనే విషయం తెలిసే అవకాశం ఉందని, ప్రస్తుతం అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నాగరాజు, రఘులను రిమాండ్‌కు తరలించారు.

తా(సా)గు నీటికీ కష్టమే..!

- నిండుకుంటున్న కండలేరు
- అట్టడుగు స్థాయికి నీటిమట్టం
- గంగ కాలువలోనూ తగ్గిన ప్రవాహం
- ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:

తమిళనాడు రాష్ట్ర దాహార్తిని తీర్చడంతో పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలు మండలాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా నెలకొల్పిన కండలేరు జలాశయంలో నీటినిల్వలు అట్టడుగు స్థాయికి చేరుకున్నాయి. కండలేరు పూర్తిస్థాయి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతమున్న నీటినిల్వ కేవలం 8.54 టీఎంసీలు మాత్రమే. నీటి నిల్వలు 8.4 టీఎంసీలకు పడిపోతే జలాశయం నుంచి బయటకు నీరు వదిలే అవకాశం లేదు. ప్రస్తుతం కాలువ గుండా కేవలం 705 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఆ నీరు చెన్నయ్‌కు కాకుండా కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి నగర వాసుల దాహార్తిని తీర్చడం కోసమే విడుదల చేస్తున్న పరిస్థితి. దీంతో తెలుగు గంగ కాలువ నుంచి రైతులను సాగునీటి కోసం నీటిని మళ్లించకుండా అధికారులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ప్రస్తుత రబీలో వేసిన వరి, వేరుశనగ పంటలు చివరి దశలో ఉండటంతో ఆఖరి తడులు వేసుకునేందుకు రైతన్న గంగ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే తెలుగుగంగ అధికారులు అడ్డుకుంటుండటంతో రైతులు ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రైతులపై కేసులు పెట్టేందుకు కూడా అధికారులు వెనకాడటం లేదు. చేతికొచ్చిన పంట ఓ వైపు కంటిముందే ఎండిపోతుండటంతో అన్నదాతలు కేసులను సైతం లెక్క చేయకుండా గంగనీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు తిరుపతి జిల్లాలో నెలకొంటున్నాయి. ఓ వైపు..ప్రజల దాహార్తి, మరో వైపు అన్నదాత కడుపుకోత వెరసి తెలుగుగంగ అధికారులు ఏం చేయాలో దిక్కుతోచక సతమతమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈఏడాది ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు.

తా(సా)గు నీటికీ కష్టమే..!!

నెల్లూరు జిల్లా కండలేరు నుంచి తమిళనాడు రాష్ట్రం పూండి రిజర్వాయర్ వరకు 406 కిలోమీటర్ల మేర తెలుగుగంగ కాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువ పరీవాహక ప్రాంతాల వెంబడి నెల్లూరు- తిరుపతి జిల్లాల వ్యాప్తంగా సుమారు 3లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గంగనీటిపై ఆధారపడి ప్రతి ఏటా పరీవాహక ప్రాంత రైతులు రెండు కార్ల పంటలను పండిస్తున్నారు.





చెన్నయ్‌కు నీటిని అందించడమే ప్రధాన లక్ష్యం అయినా కూడా లక్ష ఎకరాలకు సాగునీటిని అందించాలన్న ఒడంబడిక ఉంది. అయితే ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు లక్ష ఎకరాలకు సాగునీటిని అందించింది లేదు. చెన్నయ్‌కు తాగునీటిని సరఫరా చేసే క్రమంలో అక్కడక్కడా రైతులు నీటి చౌర్యానికి పాల్పడి చెరువులకు మళ్లించడం, లేకుంటే నేరుగా మోటార్ల ద్వారా పంప్ చేసుకోవడం జరుగుతోంది. అంతే తప్ప ప్రాజెక్టు ఒడంబడికి ప్రకారం లక్ష ఎకరాలకు సాగునీరందేలా చెరువులను నింపుతున్న పరిస్థితి కనిపించడం లేదు.

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని ఏడెనిమిది మండలాలకు కండలేరు రిజర్వాయర్ ద్వారా తెలుగు గంగ నీరు అందుతుంది. కండలేరు రిజర్వాయర్ లో 8.4 టియంసిలు నీరుకు తగ్గి పోతే ఈ ప్రాంతానికి సాగునీరు సరఫరా సాధ్యం కాదు. ప్రస్తుతం మార్చి 21 వతేదీ డాటా మేరకు కండలేరు రిజర్వాయర్ లో 8.53 టియంసిలు నీరు మాత్రమే ఉంది. ఇది 8.4 టియంసిలకు పడిపోతే సరఫరా ఆగిపోతుంది. ప్రస్తుతం 705 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బహుశా కొద్ది రోజుల్లోనే మిగులు నీరు ఖాళీ కావచ్చు.

తెలుగు గంగ నీళ్ల ఆశించి శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని కొద్ది మండలాల రైతులు పంటలు సాగు చేసే అవకాశం లేదు. కండలేరులో నిల్వ 8.4 టియంసిలకు పడిపోతే తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి పట్టణ ప్రజల తాగునీటికి కూడా రిజర్వాయర్‌లో మోటార్లు పెట్టి పంపు చేసుకోవలసిందే. కండలేరు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 68 టియంసిలు. ఈ ఏడు ఏర్పడిన వర్షాభావం వలన ఆశించిన మేరకు నీరు చేర లేదు. తిరుపతి జిల్లాకు చెందిన అధికారయుతమైన ఆయకట్టు దాదాపు 45 వేల ఎకరాలు. కానీ అంతకు మించి సాగు జరుగుతూ వుండగా ఈ ఏడు అసలుకే మోసం వచ్చింది. కండలేరు జలాశయాన్ని నింపుతున్న సోమలశిల రిజర్వాయర్ కూడా కేవలం 11 టియంసిలు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడు సాగునీరు అటుంచి వేసవి వచ్చే సరికి తాగునీరుకు కూడా కటకటలాడి పోవలసి వుంటుంది.

ఆందోళనలో రైతాంగం

తమిళనాడులో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ మిగులు జలాలతో కళకళలాడుతున్నాయి. దీంతో కండలేరు నుంచి చెన్నయ్‌కు తాగునీటి సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసింది. కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి పట్టణాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాత్రమే కాలువలో 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గంగ నీటిని ఎస్కేప్ ఛానల్ల ద్వారా మళ్లించకుండా ఎక్కడికక్కడ గేట్లు మూసి అధికారులు పహారా కాస్తున్నారు. దీంతో రబీ చివరిదశలో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. తిరుపతి జిల్లా లక్ష్మీపురం పంప్ హౌజ్ వద్ద గంగ అధికారులు ఇసుక బస్తాలతో రింగ్ బండ్ వేసి నీరు అవతలి వైపు పోకుండా అడ్డుకున్నారు. లక్ష్మీపురం గేట్లకు అవతలి వైపు తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు, కంచనపల్లి, బోనుపల్లి, కేవీబీపురం మండలంలోని అంజూరు, పవనవారికండ్రిగ, తిమ్మసముద్రం, సత్యవేడు నియోజకవర్గంలోని పలు మండలాల చెరువులకు సాగునీరందాల్సి ఉంది. అయితే లక్ష్మీపురం వద్దే నీటిని ఆపేయడంతో రైతులు ఇటీవల ఆందోళన చేపట్టారు. లక్ష్మీపురం వద్ద ఇసుక బస్తాలను తీసేసి నీటిని మళ్లించే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకుని రైతులపై దౌర్జన్యానికి దిగారు. అటుగా వెళ్తున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పోలీసులను వారించి రైతులకు నీటిని విడుదల చేయాలని ఆదేశించినా వారు వినలేదు. దీంతో చేసేది లేక రైతులు వెనుదిరగాల్సి వచ్చింది. ముఖ్యంగా వేసవికాలం సమీపిస్తున్న ప్రతిసారీ ఇలాంటి పరిస్థితులే మాకు ఎదురవుతున్నాయనీ, చెన్నయ్, తిరుపతి నగరాలకు నీరు వదిలే క్రమంలో చెరువులకు కూడా నీటిని మళ్లించేందుకు వీలుగా గంగ అధికారులు చర్యలు చేపడితే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతాంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి

- గంగయ్య, రైతు, బోనుపల్లి



తెలుగు గంగ నీటిని నమ్ముకునే రెండు సార్లు పంటలు పండిస్తున్నాం. అయితే పంట చివరి దశలో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. చెరువుల్లో నీరు అడుగంటి పోతోంది. గంగనీటిని మళ్లించేందుకు అధికారులు ఆక్షేపిస్తున్నారు. ఒకవైపు ఎండిపోతున్న పంట.. ఇంకో వైపు కాలువలో నీళ్లున్నా పారగట్టుకోలేని పరిస్థితి. ఇకనైనా అధికారులు చెరువులకు సాగునీరందించేలా ముందస్తు చర్యలు చేపట్టాలి.

తిరుమలలో భక్తుల రద్దీ

వరుస సెలవులతో శ్రీవారి దర్శనానికి 24 గంటలు



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేశస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని టిటిడి పేర్కొంది. శ్రీవారి సర్వదర్శనానికి అన్ని కంపార్టుమెంట్లలో భక్తులతో నిండిపోయాయి. కంపార్టుమెంట్లన్నీ నిండి ఆళ్వార్ ట్యాంకు అతిధి గృహం వరకు భక్తులు వేచి ఉన్నారు. శనివారం 72,986 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,482 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించుకున్నారు. తిరుమలలో శనివారం రూ.2.97 కోట్లు హుండీ ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు. వరస సెలవు దినాలు కావడంతో తిరుమల వెంకన్న ఆలయానికి భారీగా భక్తులు పోటెత్తారు.

తుంబురు తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

మార్చి 25న తుంబూరు తీర్థముక్కోటికి విశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం, సోమవారం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు శేషాచల అడవుల్లోని తుంబూరుతీర్థ ముక్కోటికి వస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులను అనుమతించారు. శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్నప్రసాదం, నీళ్లు, మజ్జిగ పంపిణీకి టీటీడీ ఏర్పాట్లు చేసింది. వైద్య బృందాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్‌లు అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. భక్తుల భద్రత కొరకు టీటీడీ భద్రత, పోలీస్, ఆటవి సిబ్బంది సేవలందిస్తున్నారు. ఆదివారం భక్తుల సౌకర్యార్థం టీటీడీ చేసిన ఏర్పాట్లను విజిఓ నందగోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, వైద్యఅధికారి డాక్టర్ కుసుమ కుమారి, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి జిఎల్ఎన్.శాస్త్రి తదితరులు పర్యవేక్షించారు.

'టీటీడీ ఏవీఎస్ఓ పద్మనాభంపై చర్యలు తీసుకోండి'

ఛైర్మన్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుమలలో పీఏసీ -1 యాత్రీ సదన్‌లో టిటిడి విజిలెన్స్ ఏవీఎస్ఓ పద్మనాభం కార్మికులపై చేయి చేసుకోవడం, బూతులు తిట్టడం వంటి చర్యలకు పాల్పడటంపై తగు చర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ టిటిడి ఛైర్మన్‌కు లేఖలో పేర్కొంటున్నట్లు సిఐటియు టీటీడీ కాంట్రాక్టర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ శనివారం తిరుమలలో పిఎసి 1 యాత్రీ సదన్‌కి టీటీడీ విజిలెన్స్ ఏవీఎస్ఓ పద్మనాభం వెళ్లి కళ్యాణకట్ట, హాళ్లు పరిశీలించారని, శుభ్రంగా లేవని డ్యూటీలో ఉన్న కార్మికులను కొట్టడం, బూతులు తిట్టడం, మెడపట్టి తోయడం వంటి చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న ఇన్‌ఛార్జులను సైతం అవమానకరంగా మాట్లాడారని, పలుమార్లు ఇదే రకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మికులపై చేయి చేసుకోవడం, బూతులు తిట్టడం, అవమానకరంగా పేద కార్మికులను మాట్లాడడం సరైన పద్ధతి కాదని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోతే సంబంధిత డిపార్టుమెంటుకు ఫిర్యాదు చేయాలి కానీ ఈ రకంగా ప్రవర్తించడం కార్మికుల మనోభావాలు దెబ్బతీయడమే అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వినాయక సాగర్ కంపు.. కంపు..

- చర్యలు చేపట్టని నగరపాలక సంస్థ
- సాగర్‌ను శుభ్రం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వినాయకసాగర్ శుభ్రత చేపట్టడంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారులు చేతులెత్తేశారు. సాగర్‌ను వారానికి ఒకసారి అయినా శుభ్రం చేయాలని, అలా శుభ్రతాచర్యలు చేపట్టకపోవడంతో వినాయక సాగర్‌కు వచ్చే స్థానిక ప్రజలు, యాత్రికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్మార్ట్‌సిటీ పథకంలో వినాయకసాగర్ అభివృద్ధి చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. శుభ్రతాచర్యలు మాత్రం గాలికి వదిలి వేశారు. వినాయకసాగర్‌కు ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్థానిక ప్రజలు, మహిళలు, వృద్ధులు వాకింగ్ చేసుకోవడానికి, చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి వస్తూ ఉంటారు. వాకింగ్ చేసుకోవడం వచ్చేవారు సాగర్‌లో అపరిశుభ్రత చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ అదితి సింగ్ ఇంతవరకు వినాయక సాగర్ సందర్శించకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది.

అదితి సింగ్ తిరుపతి నగర మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి నెలరోజులు పైగా అవుతున్నప్పటికీ స్థానిక 50 డివిజన్లో ఉన్న సమస్యలను పరిశీలించలేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే పారిశుధ్య పనులు పరిశీలించి మిగతా రోజులు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించడం వల్ల ఇక్కడ సమస్యలు పేరుకు పోతున్నాయని ఆరోపిస్తున్నారు.



వినాయకసాగర్‌కి ఎంతోమంది వస్తూ..పోతూ.. ఉంటారు. ఆహ్లాదకరం ఉండే విధంగా తీర్చిదిద్దారు. కానీ కమిషనర్ ఉన్నప్పటికీ తిరుపతి పారిశుధ్యంపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నగర సమస్యలు పట్టించుకోని కమిషనర్ తిరుపతికి ఎలా పోస్టింగ్ వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం లక్షలమంది భక్తులు వచ్చే తిరుపతి వంటి యాత్రా స్థలంలో ఇంత నిర్లక్ష్యంగా కమిషనర్ వ్యవహరిస్తారా అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినాయకచవతి సందర్భంగా నిమజ్జనానికి చేసిన శుభ్రత తర్వాత వాటి గురించి మర్చిపోయారు. ఆ విగ్రహాలు సగం కలిగి సంగం అలాగే ఉండిపోవడంతో పాటు నీరు కలుషితమై కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి నగరంలో పారిశుధ్యంతోపాటు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని స్థానికులు అంటున్నారు.

సాగర్‌ను శుభ్రం చేయండి : సిపిఎం

తిరుపతి నగరంలోని వినాయకసాగర్‌కు సందర్శకులు, వాకర్స్ పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఈ ప్రాంతం వ్యర్థాలతోనూ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని వెంటనే శుభ్రపరచాలని సిపిఎం నేత కందారపు మురళి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి నిమజ్జనం తర్వాత వినాయకుడి విగ్రహాలు, శిధిలాలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని వాటిని శుభ్రపరచడంలో తీవ్రమైన నిర్లక్ష్యం కొనసాగుతున్నదని అన్నారు. మధ్యలో ఉన్న కొలనులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయి, పచ్చటి మొక్కలతో నిండిపోయిందని నీటి యాజమాన్య నిర్వహణ లేకపోవడం వల్ల తీవ్రమైన దుర్గంధం వెలువడుతోందని పేర్కొన్నారు. వాకర్స్, సందర్శకులు దుర్గంధం కారణంగా తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని తక్షణం శిధిలాలను, వ్యర్థాలను తొలగించి నీటిని శుద్ధి చేసే విధానాన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

టిడిపి మైనార్టీ అధ్యక్షులుగా మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సుగుణమ్మకు తిరుపతి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే 40వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని టిడిపి మైనార్టీ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆదేశాలతో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మహబూబాషా ఆధ్వర్యంలో నగర మైనారిటీ కమిటీని ప్రకటించడం జరిగింది. అధ్యక్షులుగా మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా మునాఫ్, ఉపాధ్యక్షులుగా హోరున్ బాషసాబీర్, హర్షద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా యాసీన్, అధికార ప్రతినిధులుగా అబ్దుల్, మీడియా కోఆర్డినేటర్ నసరుద్దీన్, కార్యదర్శులుగా మస్తాన్‌ని నియమించడం జరిగింది. అనంతరం విలేకరులతో మహబూబాషా మాట్లాడుతూ తిరుపతి సీట్‌ను టిడిపి సుగుణమ్మకి కేటాయించాలని, ఎమ్మెల్యేగా 40 వేల మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు.



కరపత్రాలు, పోస్టర్లపై లెక్కలు చూపాల్సిందే..


ప్రజాశక్తి- తిరుపతి టౌన్



ఎన్నికలకు సంబంధించి ముద్రించే కరపత్రాలు, పోస్టర్లపై లెక్కలు పక్కగా చూపాల్సిందేనని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు తిరుపతి నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం తిరుపతి నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో రిటర్నింగ్ ఆఫీసర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన ఎలాంటి విషయాన్ని అయినా ముద్రించేటప్పుడు ఎవరి కోసం, ఎన్ని పేపర్లు ముద్రిస్తున్నామన్న వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, నమోదు చేసిన వివరాలను తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌కి, అదేవిధంగా తిరుపతి నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి మరో కాపీని తప్పనిసరిగా అందించాలన్నారు. రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్లు ముద్రించే కరపత్రాలు, పోస్టర్లలోనే ముద్రించే సంఖ్య వివరాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, డిప్యూటీ తహశీల్దార్ జీవన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మరో షాక్

- బీజేపీలో చేరిన ఎమ్మెల్యే
- ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్..?



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే అధికార ప్రతిపక్షాలు అభ్యర్థుల జాబితాను ప్రకటించటంతో పార్టీ ఫిరాయింపులు ఊపందుకున్నాయి. ఆశించిన టిక్కెట్ దక్కని చాలా మంది నేతలు తమ పార్టీకి రాజీనామా చేసి పక్క పార్టీలో జంప్ అవుతున్నారు. ఈ క్రమంలో గూడూరు వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఎన్నికల్లో తనకు టిక్కెట్ కేటాయించకపోవటంతో ఆయన ఈనిర్ణయానికి వచ్చారు. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో బీజేపీలో చేరారు వరప్రసాద్ రావు. ఈయనకు బీజేపీ నుండి తిరుపతి ఎంపీ టిక్కెట్ కేటాయించే అవకాశం ఉందని సమాచారం.

2009లో ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చిన వరప్రసాద్, గత ఎన్నికల్లో వైసీపీ తరపున గూడూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు. వరప్రసాద్ తిరుపతి వైసీపీ ఎంపీగా 2014-19 వరకు ఉన్నారు. 2019లో గూడూరు వైసిపి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన పనితీరు బాగోలేదని సర్వేలో వెనకబడ్డారని వైసీపీ ఈసారి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదు. గూడూరు ఎమ్మెల్యేగా వరప్రసాద్‌కు టికెట్ ఇవ్వవద్దని గత కొన్ని నెలలుగా గూడూరు నియోజకవర్గంలో వైసీపీ మరోవర్గం ఉధృతంగా పోరాటం చేసింది. దీంతో వైసిపి అధిష్టానం ఆయనకు టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించింది. వరప్రసాద్ సత్యవేడు లేదా సూళ్లూరుపేట టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే పార్టీలో తీసుకుంటాము కానీ టిక్కెట్ ఇచ్చే అవకాశం మాత్రం తక్కువగా ఉన్నట్లు చంద్రబాబు చెప్పడం జరిగింది. జనసేన పార్టీలో వెళ్లేందుకు పవన్ కళ్యాణ్‌తో కూడా ప్రయత్నాలు చేశారు వరప్రసాద్. జనసేన అధినేత కూడా ఎంపీ టిక్కెట్ ఇవ్వడానికి అవకాశాలు తక్కువ ఉన్నాయని చెప్పడంతో వరప్రసాద్ చూపు బిజెపి వైపు మళ్ళింది. బిజెపి అధిష్టానంతో సంప్రదించి ఆయన ఆ పార్టీలో చేరడం జరిగింది.

తిరుపతి ఎంపీగా వరప్రసాద్ ప్రయత్నం?

టిడిపి, జనసేన, బిజెపి మహాకూటమిలో భాగంగా తిరుపతి ఎంపీ టిక్కెట్ బిజెపికి ఇవ్వనున్నారు. వైసిపి గూడూరు ఎమ్మెల్యేగా ఉన్న వరప్రసాద్ ఆదివారం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఆయన తిరుపతి ఎంపీ టిక్కెట్ ఆశించే అవకాశాలున్నాయి. బిజెపికి అభ్యర్థుల కొరత ఉండడంతో వరప్రసాద్‌కు ఛాన్సు ఇచ్చే అవకాశం ఉంది. లేదంటే బిజెపి అధిష్టానం గత ఎంపీ ఉపఎన్నికల్లో పోటీ చేసిన రత్నప్రభకు టిక్కెట్ ఇస్తారా లేదంటే వరప్రసాద్ ఇస్తారా సమతూకాన్ని పరిశీలిస్తుంది. అయితే వరప్రసాద్ తిరుపతి బిజెపి ఎంపీగా టిక్కెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన సన్నిహితులు అంటున్నారు. తిరుపతి పార్లమెంటరీ ఎన్నికల్లో బిజెపి గెలుపు అంత సులువు కాదని పలువురు రాజకీయవేత్తలు అంటున్నారు. తిరుపతి అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న బిజెపిని ఎన్నికల్లో తిరుపతి ప్రజలు గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకుని ఉన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం పండుగ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏసుప్రభు రాకను ఆనందంగా జరుపుకునే మట్టల ఆదివారం సందర్భంగా గూడూరు పట్టణంలో క్రిస్టియన్లు ఏసు ప్రభు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ఎస్.ఎ.ఎల్.సి చర్చి నుండి మట్టల ఆదివారం సందర్భంగా క్రిస్టియన్లు ఏసుప్రభు గీతాలు ఆలపిస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

మోహినీ అవతారంలో అలఘునాథుడు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని శ్రీ అళఘునాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మోహిని అవతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. మాడ వీధి ఉత్సవం నిర్వహించారు. లక్ష్మీ జయంతి సందర్భంగా మహిళల చే సామూహిక కుంకుమ పూజ వైభవంగా జరిగాయి. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా బట్ట శ్రీనివాసులు ధర్మపత్ని కృష్ణమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.


'వేమిరెడ్డి దంపతులపై ఆరోపణలు తగదు'



ప్రజాశక్తి-కోట: మాజీ రాజ్యసభ సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులపై కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యక్తిగతంగా రాజకీయ ఆరోపణలు చేయడం మంచిది కాదని మాజీ ఉమ్మడి నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు ఉపాధ్యక్షులు నల్లపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోట మండలంలోని కోటమ్మతల్లి ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఘనంగా ఎంపీటీసీ యోగానందరెడ్డి

జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ ఎంపిటిసి యోగానంద రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు సర్పంచి రామ చంద్రారెడ్డి యోగానందరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు యోగానందరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి భూ దందాలకు ముగ్గురు బలి: గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వైసిపి నేతల భూ దందాతోనే ముగ్గురు ఆత్మ హత్యకు పాల్పడ్డారని, ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమని చితూరు నియోజకవర్గ టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకపక్క రాష్ట్రంలో వైసిపి మంత్రులు నేతలు భూదందా మైనింగ్ మాఫియా, ఎర్రచందన అక్రమ రవాణాకు పాల్పడుతుంటే మరోపక్క డ్రగ్స్ మాఫియాకు కేంద్ర బిందువుగా రాష్ట్ర ప్రభుత్వం ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. ఉచిత పథకాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన విమర్శించారు. కేంద్ర హోం శాఖ సైతం విడుదల చేసిన డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో ఏపీ నంబర్1గా ఉందని ప్రకటించిందని దీన్ని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాలు సరఫరా ఏ విధంగా సరఫరాతో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇటీవల విశాఖపట్నంలో వేల కోట్ల విలువగల డ్రగ్స్‌ను పట్టుకోవడమే ఉదాహరణగా చెప్పవచ్చునన్నారు. సాక్షాత్తు జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని వైసిపి నాయకులు చేపట్టిన భూదందా కారణంగా పేద కుటుంబానికి చెందిన బాలసుబ్రమణ్యం, పద్మావతి వినయ దంపతులు ఆత్మహత్యకు చేసుకున్నా రని దీన్ని చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి పాలన ఏ విధంగా సాగిందో అర్థమైందన్నారు. కొన్ని సవరణలు చేసి కోట్లాది రూపాయలు విలువచేసే భూములను కాజేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి పాలనకే సాధ్యమైందన్నారు. విశాఖపట్నంలో డ్రగ్స్ ను తీసుకొచ్చి యువత భవిష్యత్తును సర్వనాశనం చేశార న్నారు. వైసిపి నాయకులు ప్రజల ఆస్తులను దోచుకోవడం బాధాకరమని వాపోయారు. వైసీపీ నాయకులు చేపట్టిన భూ దందాలు, ఇసుక , మైనింగ్ అక్రమాలు , దౌర్జన్యాలను బయట పెడతామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చంద్రబాబును కలిసిన కన్నావరం



చంద్రబాబును కలిసిన నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి అధినేత చంద్రబాబును గాండ్ల, తెలికుల బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు ఆదివారం ఉండవల్లిలో కలిశారు. సందర్భంగా చంద్రబాబుకు శ్రీవారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం గాండ్ల కులస్తుల సమస్యను తెలుసుకుని, ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాండ్ల, తెలికుల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ చిత్రచేడు విశాలాక్షి, గిద్దలూరి ప్రభాకర్, హరగోపాల్, సింగవరపు సత్యనారాయణ, దూదిరాము తదితరులు పాల్గొన్నారు.

బృందావన్ స్కూలుకు గోల్డ్ మెడల్



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : స్థానిక సంతపేట నందుగల బృందావన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కాంచీ పురం జిల్లా తమిళనాడులో నిర్వహించిన నేషనల్ ఫిస్ట్ బాల్ కాంపిటీషన్ లో తమ పాఠశాల విద్యార్థి నులు గోల్డ్ మెడల్ సాధిం చారని పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. గెలుపొందిన విద్యార్థి నులకు అతిథులు రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమస్ ఎం అలంగేసన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె రాజపాండ్యన్, ముఖ్య అతిథులు గోల్డ్ మెడల్ అందించారు. బెస్ట్ ప్లేయర్ గా ఎంపికైన బివి హాసిని మను ను మెడల్ తో సత్కరించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. ఇలాంటి విజయాలను సాధించాలని అభినందించారు. విద్యార్థులను అభినందించారు చదువుతోపాటు ఆటలు కూడా చాలా ముఖ్యమని తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: ఆర్టీసి బస్సును టిప్పర్ ఢీకొన్న సంఘటన ఆదివారం మండలంలోని వేలూరు బైపాస్‌రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిచ్చాటూరు వయా శ్రీరామపురం బస్సును వేలూరు రహదారిలో సుబ్బనాయుడు కండ్రిగ రీచ్ నుండి పుత్తూరుకి వెళుతున్న ఇసుక టిప్పర్ బస్సును ఢీకొంది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో తృటిలో ప్రమాదం తప్పింది. బస్సులోని 20మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు.

'బొజ్జల గెలుపునకు కృషి చేస్తాం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపునకు జనసేన పార్టీ తరపున కృషి చేస్తా మని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ స్పష్టం చేశారు. చక్రధర్ అనుచర వర్గం ఆదివారం కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిని ఊరందూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా సుధీర్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఐక్య కార్యాచరణతోనే విజయం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ఐక్య కార్యచరణతో పార్టీ బలోపేతానికి కృషి చేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటామని వైసీపీ యువనాయకులు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సమిష్టి కృషితో వైసీపీని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మునిరాజ, హేమంత్, శివ, మనోహర్, ఆనంద్, రాజశేఖర్, మధు, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం..

- ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు
- పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రుయా వద్ద నిర్వహించిన ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ యు.శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. క్షయ రోగులకు పోషకాహారపు కిట్లను అందించారు. ఈ ర్యాలీలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, డాక్టర్ సుబ్బారావు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఆరు నెలల నిరంతర డాట్ కోర్సు వాడటం ద్వారా టీబీ వ్యాధి గ్రస్తులు ఆ వ్యాధి నుంచి విముక్తి పొందచ్చని ఏరియా ఆ సుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శ్రీకాళ హస్తి టీబీ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్షయ నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బం ది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఏరియా ఆసుపత్రి నుంచి పట్టణ వీధుల గుండా వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ విభాగ సూపర్వైజరు రామకృష్ణ, స్కిట్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లత, ఎల్టీ గుణవతి తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరులో

పుత్తూరు టౌన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం మిడిల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో టీబీ సూపర్వైజర్ తిరుమలయ్య, నవీన్, వైద్య సిబ్బంది, స్టెప్స్ నగరి ప్రివెన్షన్ సేవ సిబ్బందులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.

పాకాల: మండలంలోని గాదంకి పంచాయతీ గుంతగాదంకిలో ప్రజలకు క్షయ వ్యాధిపై సిహెచ్ఓ సుధ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గురుమూర్తి పాల్గొన్నారు. వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రామచంద్రపురం(చంద్రగిరి): ప్రజలు క్షయవ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఆవస్యమని శాస్త్రవేత్త డాక్టర్ యు.వి.ప్రసాద్ తెలిపారు. ఆదివారం చంద్రగిరిలోని వెంకటంపేట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శశికళ, డాక్టర్ సౌమ్యప్రియ, తాతాబాయి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే టీబీ వ్యాప్తికి మూలమని తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల డాక్టర్ మానస చెప్పారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సీనియర్ టీబీ సూపర్వైజర్ అనూష ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాష్, సుబ్రమణ్యం, నాగజ్యోతి, పార్వతి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడులో

బుచ్చినాయుడు కండ్రిగ: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం బీఎన్ కండ్రిగ ప్రభుత్వ వైద్యాధికారులు దివాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతి రుయా వద్ద



శ్రీకాళహస్తిలో




పాకాలలో

అటు ఇటు జంపింగ్

- పార్టీల్లోకి జోరుగా నాయకులు, కార్యకర్తల వలసలు

పుత్తూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి..



గాలి భాను సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండలం టీడీపీ అగ్రహారంకు చెందిన 50కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తిరుపతి రూరల్‌లో టీడీపీ నుంచి వైసీపీలోకి..



మోహిత్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి (మంగళం): టీడీపీ మాజీ ఎంపీటీసీ రేణుక, ఆమె భర్త గురుమూర్తి వైసీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నారు. ఆదివారం మంగళం పరిధిలోని రణధీర పురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎంపిటిసి రేణుకతో పాటు దాదాపు 200మంది టిడిపి సానుభూతిపరులు వైసిపీలో చేరారు. వారిని మోహిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్ రెడ్డి, రజాక్, మహమ్మద్ ఖాసిం, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో టీడీపీలోకి..



సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు, వ్యాపార వేత్త లక్కమనేని మధు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు నరసింహయాదవ్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు తదితరులు చేరారు.

రామచంద్రాపురంలో

వైసీపీ నుంచి టీడీపీలోకి..



ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని నూతుగుంటపల్లికి చెందిన తాతిరెడ్డి వెంకటేష్‌రెడ్డి ఆదివారం టీడీపీలో చేరారు. ఆయనకు టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు బొడ్డు మధుసుదన్, మహేష్‌రాయల్‌తో పాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. అదేవిధంగా కుప్పం బాదూరుకు చెందిన వైసిపి నేత కిరణ్‌కుమార్‌రెడ్డి, అతని అనుచరులు పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు.

ఓజిలిలో టీడీపీలోకి..

ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి మండలంలో ఆదివారం పలువురు టీడీపీలో భారీగా చేరారు. ప్రముఖ పరిశ్రమ వేత్త కొండేపాటి గంగా ప్రసాద్, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరస వెంకటరత్నం సమక్షంలో ధనంజయ రెడ్డి, రవీందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వర్ రాజు, సురేష్‌రాజు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్ నాయుడు, విజయభాస్కర్ రెడ్డి, 786 రఫీ, సుధాకర్‌రెడ్డి, నిరంజన్, ఖలీల్, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చలి వేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వేసవికాలంలో చలివేంద్రాలు ప్రజలకు దాహార్తి తీర్చే కేంద్రాలుగా ఉపయోగపడతాయని డాక్టర్ రోహిణి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ఐ.సి.ఎస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ పక్కన ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రమణ్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో చలి వేంద్రన్ని ఏర్పాటు చేశారు. డాక్టరు రోహిణి మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కడి వేటి చంద్రశేఖర్, సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ శ్రీనివాసులు, విజయ్, హరిబాబు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సమగ్రి అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి-కోట: ఎన్‌సీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీవిఆర్ సంస్థల ఎండీ చల్లారావు, జనరల్ మేనేజరు కృష్ణన్‌లు క్రీడా సామగ్రిని అందజేవారు. జీవీఆర్ వ్యవస్థాపకులు గ్రంధి.వెంకటేశ్వర రావ్ 84వ జయంతి సందర్భంగా రూ.35వేల రూపాయలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేసినట్లు వారు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం నిర్మలా దేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీవిఆర్ ఆఫీసు సిబ్బంది చిట్టిబాబు, ప్రొడక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని డి.ఎన్.అర్ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో 30మందికి చీరలు, పంచెలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు సనత్‌రెడ్డి మాట్లాడుతూ నైతిక పుట్టినరోజు పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు అమెరికాలో ఉన్నప్పటికీ వెస్ట్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు గత మూడు సంవత్సరాలు నుండి చేస్తున్నారని పేర్కొన్నారు. క్లబ్ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ధనంజయరెడ్డి, రాఘవరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, శ్రీనివాసులు, సిద్ధారెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

ప్రజాశక్తి-సత్యవేడు: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల్లో భాగంగా సత్యవేడులోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్‌కు వంట సామాగ్రిని వితరణగా ఇచ్చింది. ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సామాగ్రిని స్కూల్ ఇంచార్జ్ హెచ్‌ఎంకు అందచేశారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు మల్లీశ్వరన్, మహేష్, సాయి కృష్ణశ్రీ, లక్ష్మి, రమేష్, సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

వైసిపిలో పలువురి చేరిక



ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నగరి మండలంలోని టీఆర్ కండ్రిగకు చెందిన మాజీ కౌన్సిలర్ వెంకటేశ్, సాయి, వినోద్, అనంతప్ప నాయుడు కండ్రిగకు చెందిన హరి, గోవిందస్వామి, సురేష్, చంద్ర, బుగ్గకండ్రిగకు చెందిన శివ, దుర్గాప్రసాద్, రవి, మేఘనాధం, మణి, భాస్కర్, జగన్నాథం సమక్షంలో సుమారు 400 మంది వైసిపిలో చేరారు. మంత్రి నివాస కార్యాలయం వద్దకు విచ్చేసిన వీరిని మంత్రి ఆర్కేరోజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో గ్రామంలో ఏర్పడిన అంతర్గత వ్యవహారాల వల్ల పార్టీని వదలిపెట్టినా తటస్థంగా ఉంటూ వచ్చామన్నారు. ప్రస్తుతం మా వార్డులో అభివృద్ధి పనులు బాగా జరుగుతోందని ముఖ్యంగా తమ వార్డుకు దేశమ్మ ఆలయాన్ని మంత్రి రూ.3 కోట్లు వెచ్చించి పునర్మించి అన్ని వసతులు కల్పించి ఆలయ ప్రతిష్టను అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షే మం అందు తోందన్నా రు. ఇవి తమ అందరినీ కదిలిం చిందని అభివృద్ధి వైపు తిప్పిందన్నారు. మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని గ్రహించి పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్నానన్నారు. పార్టీ గెలుపుకోసం, జగనన్నను ముఖ్యమంత్రిని చేయడం కోసం అందరం కలిసి పోరాడు దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, దేశమ్మ దేవాలయ ఛైర్మన్ వేణుబాబు, వైసిపి నాయకులు బీడీ భాస్కర్, శశికుమార్, ఇంద్రయ్య పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- పూతలపట్టు: రానున్న ఎన్నికల్లో మీకు అండగా ఉంటానని అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఎరచెరువు పల్లి పంచాయతీలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజ లు ఆయనకు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఆయన వెంట నాయకులు మురళీమోహన్ నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా వేయాలి: యస్‌టియు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సాధారణ ఎన్నికలు 2024ను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యాశాఖ ఈ నెల 20వ తేది నుండి నిర్వహించ తలపెట్టిన డిఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఎస్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో మెగా డిఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు తిరుపతి జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ డిఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇంత వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదల చేయలేదని, పరీక్షా కేంద్రాల ఎంపికకు ఐచ్ఛికాల నమోదుకు వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధనంజయ నాయుడు, మోహన్, దేవేంద్ర, వాసు, రామాంజనేయులు, వెంకట రమణ, రేణుకా దేవి, ద్రాక్షాయణి, ప్రసాద్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కందూరు గంగ జాతర చాటింపు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఆదివారం గంగ జాతర నిర్వహణ కోసం గ్రామ చావిడి వద్ద ఘనంగా చాటింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు చాటింపు కార్యక్రమంలో పాల్గొని జాతర చాటింపును ప్రకటించారు. మార్చి 31వ తేదీ ఆదివారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఏప్రిల్ 1వ తేదీ సోమవారం గంగ జాతర నిర్వహించే విధంగా జాతర చాటింపులో పెద్దలు ప్రకటించారు.

వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వైసిపి విజయానికి యువత కీలకంగా పని చేయాలని జిల్లా వైసిపి యువత ఉపాధ్యక్షులు మహేంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఐరాల మండలంలో జరిగిన యువత ఆత్మీయ సమ్మేళనానికి బంగారుపాలెం నుండి యువత బైక్ ర్యాలీ చేపట్టి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో యువత అధికంగా పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యువత అధ్యక్షులు జగదీష్ సాయి, సతీష్, పలువురు యువత పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మండలం లోని ఉడమలకుర్తి, పొదలపల్లి ,చిలమాకులపల్లి వెంకటాపురం ,పిళ్ళారి కుప్పం,జిఎంఆర్ పురం గ్రామ పంచాయతీలలో పరిధిలోని గ్రామాలలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కృపా లక్ష్మి గ్రామాలలోఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉడమల కుర్తి గ్రామంలో స్థానిక సర్పంచ్ చిట్టి మహేష్ డిప్యూటీ నారాయణస్వామి కృపా లక్ష్మి గజమాలవేసి సన్మానించి పూలు జల్లుతో ఆహ్వానించి ఇంటింటికి తీసుకెళ్లి కరపత్రాలు పెంచుతూ మేనిఫెస్టోల్ని మహిళలకి గ్రామస్తులకి వివరించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి నా కూతురుకి ఒక సారి అవకాశం ఇవ్వాలన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనడానికి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి కేంద్ర బలగాలు మండల కేంద్రం గంగాధర నెల్లూరు లో ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ శంకర్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ పక్కా ఏర్పాటు చేపట్టిందని ఈ మేరకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుండి బలగాలు వచ్చాయని రాష్ట్ర పోలీసు యంత్రాంగంతో పాటు కేంద్ర బలగాలు ఈ ఎన్నికల విధుల్లో భద్రత కార్యక్రమాల్లో పాల్గొంటాయన్నారు. స్వేచ్ఛ వాతావరణం లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించు కోవడం కోసం వారిలో స్థైర్యం నిర్వహించడానికి ఇలాంటి కవాతులు జిల్లా వ్యాప్తంగా కేంద్ర బలగాలు నిర్వహిస్తున్నాయన్నారు.